# అప్పుల పేరుతో ఆరు గ్యారెంటీలు వాయిదా వేస్తారా?

- పాలకుర్తి ప్రజల తీర్పును గౌరవిస్తున్నా
- నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తా
- నిత్యం కార్యకర్తల మధ్యే ఉంటా
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



దేవరుప్పలలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, డిసెంబర్ 14 : గత ప్రభుత్వం అప్పులు చేసిందని చెప్పి, హామీ ఇచ్చిన గ్యారెంటీలు వాయిదా వేస్తారా? కేసీఆర్ ప్రభుత్వం అప్పులు చేసింది అన్ని వర్గాల సంక్షేమం కోసమే. సాగునీరు, తాగునీరు, కరెంటు కోసం అప్పులు చేశారు. తీర్చే సత్తా తెలంగాణకు ఉంది. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోగా గత ప్రభుత్వం అప్పుల పేర తాత్సారం చేయడం తగదు' అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని తిరుమల గార్డెన్‌లో గురువారం బీఆర్‌ఎస్ మండల స్థాయి శ్రేణులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి మాట్లాడుతూ ఎన్నికల ముందు తాము గెలవగానే ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి, తీరా గత ప్రభుత్వం అప్పులు చేసిందని సాకు చూపడం సరికాదన్నారు. ఆరు గ్యారెంటీలు వెంటనే అమలు చేసి, మాట నిలబెట్టుకోవాలన్నారు. ప్రజలు హామీలు చూసి ఓట్లేశారని, వాటి అమలు కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రైతులు తమ ధాన్యానికి అదనంగా రూ.500 వస్తుందని ఎదురు చూస్తున్నారని, అదనంగా రైతు బంధు పడుతుందని చూసి నిరాశపడ్డారన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించి తప్పు చేశామనే భావన ప్రజల్లో వచ్చిందన్నారు. ప్రభుత్వం ఇదే ధోరణి ప్రదర్శిస్తే ప్రజల తిరస్కారానికి గురికావడం ఖాయమని పేర్కొన్నారు.

### ప్రజల తీర్పును గౌరవిస్తున్నా..

పాలకుర్తి ప్రజల తీర్పును గౌరవిస్తున్నానని ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తాను నిస్వార్థంగా ప్రజా సేవ చేశానని, ఎవరినీ మోసం చేయలేదన్నారు. కక్షసాధింపు లేదన్నారు. కమీషన్లు తీసుకోలేదన్నారు. లంచాలు అడగలేదన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలిపినట్లు తెలిపారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేర్చానని చెప్పారు. అన్ని పార్టీల నాయకులు తన వద్దకు వచ్చి పనులు చేయించుకున్నారన్నారు. ఒక విజన్‌తో ముందుకు పోయానని, ఇక్కడ జరిగిన అభివృద్ధి రాష్ట్రంలో ఎక్కడా జరగలేదన్నారు. అయినా ప్రజలు తిరస్కరించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటమికి సవాలక్ష కారణాలున్నాయని, దాన్ని స్వీకరిస్తున్నానని అన్నారు. ఓడినా కార్యకర్తల వెన్నంటే ఉండి, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని అన్నారు. వారానికోసారి వచ్చిపోతానని మాజీ మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. కాగా, పాలకుర్తి అభివృద్ధికి తాను సహకరిస్తానని చెప్పారు. నియోజకవర్గంలోజరుగుతున్న అభివృద్ధిని కొనసాగించాలన్నారు. ఇప్పటికే మరో రూ.500 కోట్ల అభివృద్ధి పనులు మంజూరై ఉన్నాయన్నారు. వాటిని పూర్తి చేసే బాధ్యతను తీసుకోవాలన్నారు. ఇక మరోసారి గ్రామస్థాయిలో సమావేశాలు పెట్టి కార్యకర్తల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. తాను వచ్చే సారి కూడా ఇక్కడే నిలబడుతానని ఎర్రబెల్లి అన్నారు. అనంతరం గ్రామాల వారీగా సమీక్ష నిర్వహించి, కార్యకర్తల్లో ధైర్యం నింపారు. కార్యక్రమంలో ఎంపీపీ బస్వ సావిత్రి, పీఏసీఎస్ చైర్మన్ లింగాల రమేశ్‌రెడ్డి, మండలాధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు పల్లా సుందర్‌రాంరెడ్డి, బస్వ మల్లేశ్, కొల్లూరు సోమయ్య, ధరావత్ రాంసింగ్, చింత రవి పాల్గొన్నారు.



సెక్రటేరియట్‌లో మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సీతక్కను ఆశీర్వదిస్తున్న వేద పండితులు

# ములుగు అభివృద్ధికి కృషి చేస్తా..

- మరోసారి గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటా
- ఆరు గ్యారెంటీలు వంద రోజుల్లో అమలు చేస్తాం..
- పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- సెక్రటేరియట్‌లో మంత్రిగా బాధ్యతల స్వీకరణ

ములుగు, డిసెంబర్14 (నమస్తేతెలంగాణ) : ములుగు జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గురువారం హైదరాబాద్ సెక్రటేరియట్‌లో ఆమె మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తన ప్రతి అడుగూ అభివృద్ధి వైపు ఉంటుందని తెలిపారు. మరోసారి ఎమ్మెల్యేగా ఆదరించి ఆశీర్వదించిన ములుగు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారెంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని తెలిపారు. మేడారం సమ్మక్క-సారలమ్మల దీవెనలతో రాబోయే రోజుల్లో ములుగును మరింత అభివృద్ధి చేసుకోనున్నట్లు వివరించారు. కాగా, మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సీతక్కకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

# ఎమ్మెల్యేలుగా కడియం, పల్లా ప్రమాణ స్వీకారం





శాసనసభలో ప్రమాణ స్వీకారం చేస్తున్న ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ) : కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యేలుగా ప్రమాణ స్వీకారం చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్, జనగామ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన తాము కుల, మత, పార్టీలకతీతంగా ప్రజల శ్రేయస్సు కోసం పని చేస్తామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రజలందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, ఏ ఆపద వచ్చినా ఆదుకుంటామని, తమపై నమ్మకంతో ఎమ్మెల్యేలుగా పట్టం కట్టిన ప్రజలందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# సోమనాథ కళా పీఠం పురస్కార గ్రహీతల ఎంపిక

పాలకుర్తి డిసెంబర్ 14 : తెలంగాణ ఆదికవి పాల్కురికి సోమనాథుని జన్మస్థలమైన పాలకుర్తిలోని సోమనాథ కళాపీఠం సాహిత్య, సాంస్కృతిక వేదిక 2021-22 ద్వైవార్షిక పురస్కార గ్రహీతల ఎంపిక ప్రక్రియ పూర్తయిందని పీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ, కార్యదర్శి ఇమ్మడి దామోదర్ గురువారం తెలిపారు. సోమనాథ సాహిత్య పురస్కారానికి డాక్టర్ కానుకుర్తి శెట్టి సోమశేఖర్.. సోమనాథ సామాజిక శోధన పురస్కారానికి డాక్టర్ నలిమెల భాస్కర్.. సోమనాథ రంగస్థల పురస్కారానికి మంచాల రమేశ్, పందిళ్ల శేఖర్‌బాబు.. రాజయ్యశాస్త్రి స్వచ్ఛంద భాషా సేవా పురస్కారానికి డాక్టర్ మైథిలి అబ్బరాజు.. వీరమనేని చలపతిరావు సాహిత్య పురస్కారానికి ఎంఎస్ ఆర్ వెంకటరమణ, ముశం దామోదర్‌రావు.. ప్రాచీన చరిత్ర వైజ్ఞానిక పరిశోధన పురస్కారానికి డాక్టర్ సీఎస్ఆర్ ప్రభు.. డాక్టర్ రాపోలు సోమయ్య ప్రతిభా పురస్కారానికి డాక్టర్ అరూరి మహేందర్.. దేవగిరి రాజయ్య స్మారక బిరుదుకు బూస రేణుకారాధ్య ఎంపికైనట్లు తెలిపారు. సమన్వయకర్తలు రాపోలు అనందభాస్కర్, డాక్టర్ లింగంపల్లి రామచంద్ర, డాక్టర్ టీ శ్రీరంగస్వామి, మార్గం లక్ష్మీనారాయణలతో కూడిన మండలి ఈ పురస్కారాలను ఎంపిక చేసినట్లు వారు చెప్పారు. 2023 డిసెంబర్ 31న పాలకుర్తిలో ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

## ఎస్సెస్సీ కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తులు

ఏటూరునాగారం, డిసెంబర్ 14 : స్టాఫ్ సెలక్షన్ కమిషన్ 2023-24 సంవత్సరానికి భర్తీచేసే కానిస్టేబుల్ పోస్టులకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గిరిజన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీఏ పీవో అంకిత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31 వరకు తమ దరఖాస్తులను http://ssc.nic.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో జనవరి 1వ తేదీలోపు ఫీజు చెల్లించాలని, ఫిబ్రవరి-మార్చిలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఉంటుందని, అర్హులు దరఖాస్తు చేసుకోవాలని పీవో తెలిపారు.

# టీబీజీకేఎస్‌తోనే సింగరేణికి మనుగడ

- ఎల్లప్పుడు కార్మికుల పక్షాన నిలబడింది ఈ సంఘమే..
- లాభాల వాటా పెంచిన ఘనత కేసీఆర్‌దే..
- గుర్తింపు ఎన్నికల్లో బాణం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలి
- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- కేటీకే-8వ గని వద్ద ఎన్నికల ప్రచారం



కేటీకే-8 ఇంక్లైన్ వద్ద ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

గణపురం, డిసెంబర్ 14 : తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘంతోనే సింగరేణి మనుగడ సాధ్యమని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. ఈ నెల 27వ తేదీన జరిగే సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు బాణం గుర్తుకు ఓటువేసి టీబీజీకేఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ కేటీకే-8వ గని వద్ద గురువారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం టీబీజీకేఎస్ ఎల్లప్పుడు పోరాడుతుందని, కేసీఆర్ నాయకత్వంలో కార్మికులకు ఎన్నో హక్కులను కల్పించామని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యేగా సింగరేణి కార్మికుల క్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేశానన్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వారసత్వ ఉద్యోగాలను ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. గతంలో ప్రతిభాపరమైన ఉద్యోగాలు కల్పించాలని సీఎంను కోరానని, అందరూ బదిలీ వర్కర్లుగా కాకుండా విద్యాపరమైన ఉద్యోగాలు వచ్చేలా కృషి చేశానని తెలిపారు. సమైక్య రాష్ట్రంలో 16శాతం ఉన్న లాభాల వాటాను 32 శాతానికి పెంచిన ఘనత టీబీజీకేఎస్‌కే దక్కుతుందన్నారు. కార్మికులు ఎటువంటి సమ్మె చేయకుండానే వారికి అన్ని రకాల హక్కులను కల్పించామన్నారు. కార్మికులకు టీబీజీకేఎస్, బీఆర్ఎస్ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు బడితల సమ్మయ్య, సెంట్రల్ కమిటీ మెంబర్ బత్తుల వెంకటేశ్, నాయకులు సదానందం, సమ్మిరెడ్డి, రఘోత్తంరెడ్డి, శంకర్‌రెడ్డి, జగత్‌రావు, శంకర్, రాంచందర్, పాషా, శివ, రాజేందర్, రాజూనాయక్, రత్నం అవినాశ్, లక్కాకుల శ్రీనివాస్, మునిగాల సురేశ్, తాళ్లపల్లి శశికాంత్‌గౌడ్, చక్రపాణి పాల్గొన్నారు.

# అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక



బహుమతులు పొందిన క్రీడాకారులతో జనగామ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు

జనగామ చౌరస్తా, డిసెంబర్ 14 : జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో గురువారం అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక పోటీలు జరిగాయి. సుమారు 400మంది క్రీడాకారులు హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి అంతర్ జిల్లాల అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని అథ్లెటిక్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పెద్ది వెంకటనారాయణగౌడ్, గంగిశెట్టి మనోజ్‌కుమార్ తెలిపారు. గుజరాత్‌కు వెళ్లే క్రీడాకారులకు అసోసియేషన్ తరపున రవాణా చార్జీలు, దుస్తులు, బ్యాగు అందజేస్తామన్నారు. ఎంపిక పోటీల్లో ప్రతిభకనబర్చిన వారికి మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు. పోటీలకు అబ్జర్వర్లుగా తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కొదరిపాక సారంగపాణి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కోశాధికారి ఆవుల అశోక్, నిర్వహణ కార్యదర్శి వంచ చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు రంజిత్, సుధారాణి, రాజు, హనుమంతరావు, రవీంద్ర ప్రసాద్, ప్రమోద్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు గోర్ సింగ్, పీఈటీలు రాజు, మంజుల పాల్గొన్నారు.